

నేడు కార్మికులకు సెలవు

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) పురస్కరించుకుని గురువారం అన్ని షాపులు, హోటళ్లు, ఇతర సంస్థల్లో పనిచేసే కార్మికులకు సెలవు దినంగా ప్రకటించినట్టు ఉప కార్మిక కమిషనర్ ఎస్‌డీవీ ప్రసాద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ ఎవరైనా యాజమానులు కార్మికుల చేత పనిచేయించు కుంటే 30 రోజుల్లోపు ఒక రోజు సెలవు ఇచ్చి ఆ రోజుకు రెట్టింపు వేతనం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు.


అప్పన్న నిజరూప దర్శనానికి తరలివచ్చిన భక్తులు

సింహగిరికి పోటెత్తిన భక్తులు

● అంగరంగ వైభవంగా చందనోత్సవం

సింహాచలేశుడి చందనోత్సవం బుధవారం సంప్రదాయ బద్ధంగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తుల హరినామ స్మరణ, జయజయధ్వానాల మధ్య అంగరంగవైభవంగా సాగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, తొలి దర్శనం చేసుకున్నారు.

6 లో

శుభ్రత సేవకులు



పరిసరాల శుభ్రత కోసం రేయింబవళ్లూ పరితపిస్తారు. చేతికి గ్లౌజ్.. నోటికి మాస్కు లేకపోయినా కాలువలను శుభ్రం చేస్తారు. చెత్త కంట పడితే ఊడ్చనిదే కదలరు.. జంతు వ్యర్థాల నుంచి దుర్గంధం వస్తున్నా భరిస్తూనే దూరంగా తీసుకువెళ్లి పూడుస్తారు. ఇళ్ల నుంచి సేకరించే వ్యర్థాలను ఊరుకు దూరంగా తరలించి మంటపెడ్తారు. అందుకే వారు లేకపోతే సమాజంలో శుభ్రత లేదు.. ఆరోగ్యం లేదు.. ఆహ్లాదం లేదు... ఆనందం లేదు. సమాజ హితం కోరుతూ విధులు నిర్వహించే వారే పారిశుధ్య కార్మికులు. వీరు రోజంతా శ్రమిస్తేనే మిగతా ప్రజలు హాయిగా రోజువారీ జీవితాన్ని గడపగలరు. మేడేను పురస్కరించుకుని ఆ అపూర్వ శ్రామికులు... సేవకులపై ప్రత్యేక కథనం 6లో


రామాంజనేయ కాలనీ శ్మశాన వాటిక

రుద్రభూమినీ వదలరా?

కబ్జాకు కాదేదీ అనర్హం అనుకున్నారో.. ఒకరిని చూసి ఒకరు తామెందుకు ఆక్రమించకూడదనుకున్నారో... ఆక్రమిస్తే తప్పేంటని భావించారో.. ప్రభుత్వ స్థలమే కదా అడిగేదెవరని తెగించారో కానీ శ్మశానంపై పడ్డారు. కొన్నాళ్లుగా ఎవరికి తోచిన రీతిలో వారు ఆక్రమిస్తూ వచ్చారు. మూడెకరాల్లో ఉన్న రుద్రభూమిని 22 సెంట్లకు తీసుకొచ్చారు. ఆక్రమిత స్థలాల్లో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టేశారు. చీపురుపల్లి రామాంజనేయ కాలనీ శ్మశాన వాటిక దయనీయ పరిస్థితిది. కబ్జాదారుల్లో బడాబాబులు ఉండడం గమనార్హం. కర్మకాండల నిర్వహణకు వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. శ్మశానం పరిస్థితి చూసి ఆవేదన చెందుతున్నారు.

● చీపురుపల్లి రామాంజనేయ కాలనీ శ్మశానవాటిక స్థలం కబ్జా
● మూడెకరాల్లో మిగిలింది 22 సెంట్లే
● ఆక్రమిత స్థలాల్లో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
● కర్మకాండల నిర్వహణకు ఇబ్బందులు


సర్వే నెం.43/27లో ప్రైవేటు గోదాము

చీపురుపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)

గెడ్డలు, వాగులు, రోడ్ల పక్కనున్న ఖాళీ స్థలాలు, చెరువు గట్లను తమ ఖాతాల్లో వేసుకుంటున్న కబ్జాదారులు చివరికి రుద్రభూమిని కూడా వదిలిపెట్టడం లేదు. ఖాళీగా ఉందని కన్నేసి కొట్టేస్తున్నారు. చీపురుపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న రామాంజనేయ కాలనీ శ్మశాన వాటికకు ఇప్పుడు అదే గతి పట్టింది. సర్వే నం.42, 43లో సుమారు మూడు ఎకరాల స్థలాన్ని మరుభూమి కోసం కేటాయించారు. వందల యేళ్ల నుంచి ఇక్కడ శ్మశానం కొనసాగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు ఆక్రమణల పర్వానికి తెర తీశారు. సుమారు 1.49 ఎకరాల్లో ప్రభుత్వ భవనాలు నిర్మించగా, 1.58 ఎకరాలను ఆయా వర్గాలు ఆక్రమించుకున్నాయి. ఆక్రమిత స్థలంలో కొంతమంది పేదలు పూరిపాకలు నిర్మించుకున్నారు. చాలా మంది వ్యాపార సంస్థలు ఏర్పాటు చేశారు. మరికొంత మంది చిన్నచిన్న మెకానిక్ షెడ్లు నిర్మించారు. ఆక్రమణదారుల్లో పేదలతో పాటు బడా బాబులు కూడా ఉన్నారు. దీంతో మూడెకరాల్లో ఉండాల్సిన శ్మశాన వాటిక స్థలం ఇప్పుడు కేవలం 22 సెంట్లకు పడిపోయింది. ఈ క్రమంలో అప్రమత్తమైన మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో (మిగతా 8వ పేజీలో..)

పురిటిపెంటలో చెరువు కబ్జా

● మట్టివేయడం ద్వారా సొంతం చేసుకునే ఎత్తుగడ

గజపతినగరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పురిటిపెంట పంచాయతీలో సర్వే నెంబర్ 72/1లో ఉన్న చెరువును కొందరు వ్యక్తులు ఆక్రమించే పనిలో పడ్డారు. రెండు రోజుల కిందట 30 సెంట్ల విస్తీర్ణంలో రాత్రి సమయంలో మట్టి వేశారు. ఆ స్థలాన్ని వాటాలుగా పంచుకోవాలని భావించారు. రెవెన్యూ శాఖలో పని పూర్తి చేసే వ్యక్తికి మూడు సెంట్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించే వ్యక్తికి మూడు సెంట్లు, ఎటువంటి ఆటంకాలు కలిగించకుండా ఉండేందుకు వైసీపీ అనుచరుడికి మూడు సెంట్లు లెక్కన పంపకాలకు నిర్ణయించుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో స్థానికులు కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు కబ్జాపై గ్రామరెవెన్యూ అధికారి గోవిందరావును వివరణ కోరగా చెరువులో మట్టి వేసి ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పురిటిపెంట చెరువులో మట్టివేసి ఆక్రమణకు పాల్పడిన దృశ్యం

గృహయోగం

● జోరందుకున్న పేదల ఇళ్ల నిర్మాణం
● రూ.8కోట్ల 50 లక్షలు విడుదల చేసిన ప్రభుత్వం
● జూన్ నాటికి 7,481 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం
● కసరత్తు చేస్తున్న అధికారులు



విజయనగరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నిరుపేద, పేద, మధ్యతరగతి వారికి గృహయోగం పట్టనుంది. మొన్నటివరకు నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు ఇప్పుడిప్పుడే జోరందుకున్నాయి. ప్రభుత్వం సాయం ప్రకటించాక లబ్ధిదారులు ఒక్కొరొక్కరుగా ముందుకొస్తున్నారు. 2019 నుంచి 2024 వరకూ వైసీపీ ప్రభుత్వం ఇళ్లు అయితే మంజూరు చేసింది కాని వాటిని పూర్తిచేసేందుకు తగిన ప్రణాళిక లేకపోయింది. ఈ నేపథ్యంలో పేదల ఇళ్లు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. కొన్ని పునాదుల స్థాయి దాటగా మరికొన్ని శ్లాబ్ స్థాయిలో ఆగిపోయాయి. వీటిని పూర్తి చేయించాలని ఈ ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారులకు అదనపు సాయం ప్రకటించింది. ఆ మేరకు అధికారులకు లక్ష్యం నిర్దేశించింది. జూన్ నాటికి అదనంగా 7,481 ఇళ్లు పూర్తి చేయాలని అధికారులు కంకణం కట్టుకున్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 కింద 2019 నుంచి 2024 వరకూ జిల్లాకు 78,805 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో చాలా వరకు నిర్మాణాలు ముందుకు సాగలేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం 44,947 ఇళ్లు పూర్తిచేయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.50 వేలు, రూ.75 వేలు, రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక సాయం ప్రకటించింది. దీంతో గృహ నిర్మాణం ఊపందుకుంది. 44,947 ఇళ్లల్లో 22,850 ఇళ్లను పూర్తిచేసేందుకు తొలుత అధికారులు (మిగతా 8వ పేజీలో..)

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు తక్షణమే పూర్తి చేయాలి. జూన్ 12 నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా పైస్థాయి నుంచి కింది స్థాయి వరకూ గృహ నిర్మాణశాఖ సిబ్బంది కృషి చేస్తున్నారు. ఈమేరకు వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఏఈ, డీఈ, ఈఈలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

- మురళీ, హౌసింగ్ పీడీ, విజయనగరం


విజయనగరం సమీపంలో మధ్యలో నిలిచిపోయిన ఇళ్లు

పఠనాసక్తిని పెంపొందించేందుకే 'పుస్తక క్లబ్'

ప్రముఖ రచయిత డాక్టర్ జక్కు రామకృష్ణ 7

అర్ధరాత్రి బీభత్సం

● ఈదురుగాలులకు కూలిన కరెంట్ స్తంభాలు.. నేలవాలిన చెట్లు

జిల్లాలో చాలా చోట్ల మంగళవారం రాత్రి ఈదురుగాలులు వణికించాయి. అర్ధరాత్రి బీభత్సం సృష్టించాయి. సంతకవిటి మండలంలో అనేక చోట్ల కరెంటు స్తంభాలు నేలకూలాయి. మామిడికాయలు నేల రాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. బొబ్బిలి మండలంలోని కోమటిపల్లి, కలవరాయి తదితర ప్రాంతాల్లో రహదారుల పక్కనున్న చెట్లు విరిగిపోయాయి. కొత్తపెంట, మెట్టవలస తదితర గ్రామాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. మామిడి పంటకూ నష్టం వాటిల్లింది.

8


సంతకవిటి: బూరాడపేటలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం


బొబ్బిలి: కొత్తపెంటలో నేలవాలిన అరటి చెట్లు

బాలుడి ప్రాణాలు తీసిన పిడుగు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గిరిశిఖర పంచాయతీ దారపర్తి శివారు గ్రామం పోర్లులో పిడుగుపాటుకు బుధవారం ఓ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. గ్రామానికి చెందిన కేరంగి అప్పారావు బుధవారం ఉదయం పశువులను మేతకు తోలుకొని వెళ్లాడు. వాటిని మేతకు వదిలి ఇంటికి వచ్చాడు. ఈ సమయంలో వాతావరణం మారడం చూసి చిన్న కుమారుడు కిరణ్(10), పెద్దకుమారుడు అనీల్‌ను పంపి పశువులను ఇంటికి తోలుకురమ్మన్నాడు. అయితే అప్పటికే పశువులు ఇంటికి సమీపంలోని చెట్టు వద్దకు చేరాయి. వర్షం మొదలవ్వడంతో కిరణ్,అనిల్ కూడా చెట్టు కింద ఉండిపోయారు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడింది. కిరణ్ సంఘటనా స్థలంలో మృతిచెందగా అక్కడున్న మూడు ఆవులు కూడా చనిపోయాయి. అనిల్ గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గుర్తించి డోలీలో మైదాన ప్రాంతానికి తరలించి ఎస్.కోట సామాజిక ఆసుపత్రిలో చేర్చారు. కిరణ్ పల్లపుదుంగాడలో మూడో తరగతి చదువుతున్నాడు.

ప్రశాంతంగా పాలిసెట్

జిల్లా వ్యాప్తంగా 6,938 మంది హాజరు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకూ పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 8134 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6938 మంది రాశారు. 1196 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోని 144 సెక్షన్ అమలు చేశారు. వైద్య, మంచినీటి సదుపాయం కల్పించారు.


జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కమనీయం.. అప్పన్న నిజరూపం



- దర్శించి తరించిన భక్తజనం
- వైభవంగా చందనోత్సవం
- సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)

ఏడాదికోసారి నిర్వహించే సింహాచలం వరాహలక్ష్మీనృసింహ స్వామి నిజరూప దర్శనం (చందనోత్సవం) బుధవారం వైభవంగా జరిగింది. లక్షకుపైగా తరలివచ్చిన భక్తుల జయజయధ్వానాల మధ్య అప్పన్నకు పైపూతగా సమర్పించిన చందన విసర్జన కార్యక్రమాన్ని మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత అర్చకులు ప్రారంభించారు. మూలవిరాట్‌పై ఉన్న 12 మణుగుల (500 కిలోలు) సిరి చందనాన్ని నోటికి గుడ్డలు కట్టుకుని రజిత బొరిగెలతో ఒలిచి, స్వామిని నిజరూపంలోకి తీసుకువచ్చారు. అనంతరం స్వామి శిరస్సు, గుండెలపై రెండు చందనపు ముద్దలను ఉంచారు. షోడశోపచార పూజలు చేసిన తరువాత ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పించారు. తెల్లవారుజామున 2.45 గంటల నుంచి సాధారణ భక్తులను దర్శనానికి అనుమతించారు.

తరలివచ్చిన భక్తులు..

స్వామిని నిజరూపంలో దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో అర్ధరాత్రి నుంచే క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ప్రముఖులకు ఉదయం ఆరు గంటల వరకు మాత్రమే అంతరాలయ దర్శనాలు కల్పించిన అధికారులు అనంతరం నీలాద్రి గుమ్మం వద్ద గేటుకు తాళాలు వేశారు. ఇదిలావుండగా తెల్లవారుజామున జోడుభద్రాల వద్ద రూ.300 క్యూ సమీపంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందడంతో సర్వత్రా ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో భక్తుల రాక తగ్గింది. ఆ తరువాత క్రమేపీ రద్దీ పెరుగుతూ ఉదయం పదిన్నర గంటల సమయానికి నిర్దేశించిన క్యూలను దాటి సుమారు 1.5 కిలోమీటర్ల పొడవున ఘాట్‌రోడ్డుపైకి చేరింది. తెల్లవారుజామున భారీవర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో మరింతమంది భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆ తరువాత వర్షం కురిసినప్పటికీ భక్తుల తాకిడి తగ్గలేదు. పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు నిజరూప దర్శనం చేసుకున్నారు.





స్వామికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న అశోక్ గజపతిరాజు దంపతులు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



బస్సుల వద్ద భక్తజనం

సంప్రదాయబద్ధంగా సహస్ర ఘటాభిషేకం..

ఆలయ ఆచారం ప్రకారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయరుస్వామి పర్యవేక్షణలో నాలుగు వందల మంది శ్రీవైష్ణవులు అంతరాలయంలో స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆ తరువాత తొలివిడత చందన సమర్పణ గావించి, శీతలోపచారాలు సమర్పించి కర్పూర నీరాజనాలిచ్చారు. అప్పన్నను నిత్యరూపంలోకి తీసుకురావడంతో చందనోత్సవం పరిసమాప్తమయింది.







స్వామి దర్శనానికి వచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబసభ్యులు

శుభ్రత సేవకులు

- తెల్లారి లేవగానే చీపుర్లతో వీధుల్లోకి..
- ఊడ్చాలి.. కాలువలో మురుగు తీయాలి
- నేతలు, అధికారులు వస్తే తీరికే ఉండదు
- ప్రమాదకర పరిస్థితుల్లో విధులు
- కుటుంబం కోసం తప్పదంటున్న వైనం
- కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల దుస్థితిదీ
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం



● రాజాం మునిసిపాల్టీలోని తెలగావీధిలో ఈ కార్మికుడు కాలువలను శుభ్రం చేస్తున్నాడు. చెత్త, ఖాళీ సీసాలను బయటకు తీస్తున్నాడు. తీవ్ర దుర్గంధం నడుమ కనీస భద్రత చర్యలు లేకుండా పని చేస్తున్నాడు. చేతికి గ్లౌజ్ కానీ.. నోటికి మాస్కు కానీ లేదు. ఒంటిపై వేసుకునేందుకు నాప్‌కిన్ కూడా లేదు. దీనిపై ప్రశ్నిస్తే.. కుటుంబం కోసం తప్పదని ఆవేదనగా చెప్పాడు.



● రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో పారిశుధ్య కార్మికుడు ఇలా ప్రమాదకర స్థాయిలో పనిచేస్తున్నారు. కనీసం కాలువను శుభ్రం చేసేందుకు పరికరాలు లేవు. చెత్త, మురుగు, ఖాళీ సీసాలు తొలగించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. తొలగించేందుకు పరికాలు ఇవ్వరా? అని ప్రశ్నిస్తే.. అవేంటి అని అమాయకంగా అడిగారు.



● ఇతని పేరు బోని సూర్యనారాయణ. శృంగవరపుకోట మేజర్ పంచాయతీలో 1990 నుంచి పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నారు. చెత్తా చెదారం ఎత్తడంతో పాటు అధికారులు చెబుతున్న పనులన్నిటినీ చేస్తున్నా ఎదుగూబొదుగు లేదు. ఇప్పటికీ దినసరి కూలీగానే ఉన్నారు. రోజుకు రూ.20 చొప్పున నెలకు రూ.600 వేతనం నుంచి పని చేస్తున్నారు. ఇప్పుడు ఒక్కరోజు కూడా పని మానకుండా నెలంతా వీధులను శుభ్రం చేస్తే రూ.10,500 చేతికి వస్తుంది. ఇలా వచ్చిన జీతంతోనే తినీతినక ముగ్గురు ఆడపిల్లలకు పెళ్లి చేశారు.

విజయనగరం రింగురోడ్డు/రాజాం రూరల్/ రాజాం/ ఎస్.కోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)

కోడికూయగానే నిద్రలేవాలి. సూర్యోదయానికి ముందే వీధుల్లోకి వెళ్లాలి. రోడ్లపై చెత్తాచెదారం తొలగించాలి. కాలువల్లో మురుగు ఎత్తిపోయాలి. దుర్గంధం వస్తున్నా.. భద్రత వస్తువులు లేకున్నా పనిచేయక తప్పదు. ఒక రోజు పనిమానేస్తే కుటుంబం గడవని పరిస్థితి. ఏ పదో, పదకొండుకో ఇంటికి వెళ్లి స్నానం చేసి.. వంట వండుకుని.. ఇంత పిల్లలకుపెట్టి.. తామూ తినాల్సిన పరిస్థితి వారిది. మళ్లీ మధ్యాహ్నం పనికి రావాలి. ఏళ్లు గడుస్తున్నా వారికి అరకొర వేతనాలే. ఎన్ని మేడేలు వచ్చి పోతున్నా వీరి బతుకులు మాత్రం బాగుపడడం లేదు. మస్తరు టైమ్‌కు హాజరు కాలేకపోతే ఆ రోజు వేతనం కట్. అధికారుల నుంచి చీవాట్లు తప్పదు. వీరు ఉదయం ఐదారు గంటలు, మధ్యాహ్నం నుంచి నాలుగైదు గంటలు విధులు నిర్వహించాలి. పండగలు, రాష్ట్ర జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చినప్పుడు అదనపు పని గంటలను తప్పని సరి. దీనికి ప్రత్యేకంగా జీతం అంటూ ఉండదు. అనాథ శవాలను పూడ్చాలన్నా వీరే కావాలి. కేసు దర్యాప్తునకు తిరిగి తెరవాలన్న వీరే ఉండాలి. ఇంతటి దుర్భర జీవితం గడుపుతున్న వారికి కదిలిస్తే ఎన్నో కన్నీటి గాథలు. గురువారం కార్మిక దినోత్సవం సదర్భంగా జిల్లాలోని కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల జీవితగాథలు కొన్ని..



విజయనగరంలో చెత్త ఎత్తుతున్న కార్మికులు



బొబ్బిలిలో డ్రైనేజీ క్లియర్ ఇలా..

చాలీచాలని వేతనం.. పోషణ భారం



28 ఏళ్లుగా ఔట్‌సోర్సింగు విధానంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నాను. వేతనం క్రమంగా పెరుగుతూ వచ్చినా, ఐదేళ్లుగా రూ.18 వేలతోనే నెట్టుకువస్తున్నాం. పీఎఫ్, ఈఎస్ఐ వంటివి కట్ చేస్తున్నారు. కొడుకుకు ఉద్యోగం లేదు. భర్త అనారోగ్యంతో మంచానికి పరిమితమయ్యాడు. కుటుంబ భారమంతా నాపైనే పడింది. ఇబ్బందిగా ఉంది. నిత్యావసర వస్తువులు, కాయగూరలు.. ఇలా అన్నింటి ధరలు పెరిగినా, వేతనం మాత్రం పెరగడం లేదు. దీంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఈ వృత్తినే నమ్ముకున్నాను. 17 ఏళ్లకే పారిశుధ్య విభాగంలో చేరాను. ఈ ఉద్యోగం తప్ప వేరే ఉద్యోగం చేయలేని పరిస్థితి నాది.

-కె.గౌరి, పారిశుధ్య కార్మికురాలు, స్టేడియంపేట, విజయనగరం

ఇళ్లు మంజూరు చేయాలి..



పారిశుధ్య కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలి. విభిన్న ప్రతిభావంతురాలిని అయిన నేను ఈ వృత్తినే నమ్ముకున్నా. వచ్చిన వేతనం నెలనాడు కనీస అవసరాలకే సరిపోతుంది. సొంతింటి కల నేరవేరడం లేదు. ఔట్ సోర్సింగు కార్మికుల కోసం నగరానికి దగ్గరగా ఇళ్లు ఇవ్వాలి. పీఎఫ్, ఈఎస్ఐ పోనూ ప్రస్తుతం ఇస్తున్న వేతనం రూ.18 వేలు ఎటూ చాలడం లేదు. నిత్యావసర వస్తువులు, ఇతర ధరలను పరిగణనలోకి తీసుకుని వేతనాన్ని పెంచాలి.

-ఆర్.వరలక్ష్మి, స్టేడియం కాలనీ, పారిశుధ్య కార్మికులు, విజయనగరం

కనీస సౌకర్యాలు లేవు..



నగర పరిశుభ్రత కోసం పాటుపడతాం. అందరూ శుభ్రంగా ఉండాలని కోరుకుంటాం. కానీ మాకు భద్రతలేని పరిస్థితి. గ్లౌజులు, మాస్కులు, ఇతరత్రా వస్తువులు ఇవ్వాలి. అవి సకాలంలో అందడం లేదు. దీని వల్ల గ్లౌజులు, మాస్కులు లేకుండానే పనిచేయాల్సి వస్తోంది. ఏవైనా వ్యాధులు వస్తే మా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. పీఎఫ్, ఈఎస్ఐ పోను రూ.18 వేలు వస్తున్నది. కనీసం మరో రూ.పది వేలు పెంచితే జీవనం గడుస్తుంది. హెల్త్‌కార్డులు వున్నా ఈఎస్ఐ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మందులు బయట కొనాల్సిన పరిస్థితి.

-బి.శంకరరావు, పారిశుధ్య కార్మికుడు, జొన్నగుడ్డి, విజయనగరం

పనికి తగ్గ వేతనం రావడం లేదు..



పారిశుధ్య కార్మికులకు పనికి తగ్గ వేతనం అందడం లేదు. ఎనిమిది గంటల కంటే ఎక్కువగా పనిచేస్తున్నా వచ్చే వేతనం పీఎఫ్, ఈఎస్ఐ పోనూ రూ.18 వేలే. ప్రస్తుతం ఇది ఎటూ సరిపోని పరిస్థితి. దీంతో పారిశుధ్య కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఒకే తరహాగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఔట్ సోర్సింగు ఉద్యోగుల్లో తీవ్ర వ్యత్యాసం వుంటున్నది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం అమలు చేయాలి. ఔట్‌సోర్సింగు కార్మికులను రెగ్యులర్ చేస్తే వారి పరిస్థితి మారుతుంది.

-ఎ.జగన్మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు

ఎండైనా.. వానైనా.. పనిచేయాల్సిందే..



పదేళ్లుగా పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నా. జీవితంలో ఎదుగూబొదుగు లేదు.. ఎండైనా, వానైనా.. ఆరోగ్యం సహకరించినా, సహకరించకపోయినా పనిచేస్తేనే నాలుగు రాళ్లు వస్తాయి.. తెల్లారగానే రోడ్డెక్కాలి. రోడ్డు ఊడ్చి తిరిగి తొమ్మిదికో, పదికో ఇల్లు చేరుతాను. కొన్నిసార్లు ముక్కు మూసుకుంటూ దుర్గంధాన్ని సైతం తుడవాల్సి వస్తోంది. ఉద్యోగంలో ఇవన్నీ మామూలుగానే భావిస్తున్నా. కష్టమని ఇంట్లో కూచుంటే పొట్టగడిచేదెలా..? నామీద ఆధారపడిన వారి సంగతేంటి..? ఇవన్నీ గుర్తిస్తే పని చేసేటపుడు పడుతున్న కష్టాలను మరిచిపోవాల్సిందే.

-సావిత్రి, పారిశుధ్య కార్మికురాలు, రాజాం మున్సిపాలిటీ

కష్టమైనా, నష్టమైనా తప్పదుమరి..



వ్యర్థాలనూ ఎత్తిపోయాల్సి వస్తుంది. దుర్గంధాన్ని భరిస్తూ పరిశుభ్రం చేయాలి. కాలువలతో పాటు రోడ్డుకిరువైపులా దుర్గంధం పేరుకుపోతోంది. పగిలిపోయిన మద్యం సీసాలను ఎత్తాల్సిన పరిస్థితుల్లో ఒక్కోసారి గాయాలకు గురైన సందర్భాలున్నాయి. కష్టమైనా, నష్టమైనా కుటుంబం కోసం ఇష్టంగా బాధల్ని భరిస్తూ పనిచేస్తాను. పదేళ్లుగా ఇదే పరిస్థితి. పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సౌకర్యాలు మెరుగుపరచాలి.

-నాగవంశం గోపి, రాజాం మున్సిపాలిటీ



రియల్ఎస్టేట్‌గా మారిన జూట్ మిల్లు స్థలం

మాడే కడుపులతో మేడే

- జూట్ కార్మికుల వ్యథాభరిత జీవితగాథలు
- ఉపాధి కోల్పోయి మంచం పట్టిన కార్మికుడు
- స్థానిక జూట్‌మిల్లుల మూసివేత ప్రభావం
- మిల్లు తెరిపిస్తామని నమ్మించి వైసీపీ మోసం

బొబ్బిలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అది 2019 ఎన్నికల సమయం. అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌తో పాటు వైసీపీ నాయకులు ఊరూరా తిరిగి మూతపడ్డ పరిశ్రమలను తెరిపిస్తామని, కార్మికులకు ఉపాధిని పునరుద్ధరిస్తామని బీరాలు పలికారు. గడచిన ఐదేళ్లలో మిల్లులు తెరవలేదు సరికదా.. వాటిని నేలమట్టం చేసి రియల్‌ఎస్టేట్లుగా మార్చేందుకు యత్నించారు. ఫలితంగా బొబ్బిలి ప్రాంతంలోని మూడు జూట్‌మిల్లులు, పంచదార పరిశ్రమ మూతపడిన ప్రభావం కార్మికుల కుటుంబాలపై పెను ప్రభావం చూపింది. సుమారు ఐదువేల కార్మికులు రోడ్డున పడ్డారు. ఉపాధి కోల్పోయిన కార్మికులను పలకరిస్తే వారి వ్యథాభరితమైన జీవితగాథలను ఏకరువు పెడుతున్నారు. కన్నీటి పర్యంతమవుతున్నారు.

● బొబ్బిలి పట్టణంలోని తారకరామాకాలనీకి చెందిన 54 సంవత్సరాల పిరిడి రాంబాబు అనే మాజీ కార్మికుని వ్యథ అత్యంత దయనీయంగా ఉంది. 14 సంవత్సరాలపాటు స్థానిక జూట్‌మిల్లులో డ్రాయింగ్ డిపార్టుమెంట్‌లో పనిచేశారు. 2014లో జూట్‌మిల్లును మూసేయడంతో ఆయన జీవితంలో పెద్ద పిడుగుపడ్డట్టయింది. రెండేళ్ల క్రితం ఆయనకు పక్షవాతం సోకింది. రెండు కాళ్లూ, చేతులూ పూర్తిగా అదుపు తప్పాయి. వైద్యం చేసుకునే స్థోమత లేక, మందులు కొనుక్కోలేక దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటూ భార్య తెచ్చే అరకొర జీతంతో కాలం నెట్టుకొస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, వృద్ధురాలైన అత్త ఉన్నారు. ఆడపిల్లలకు పెళ్లిళ్లు అయి అత్తారింట్లో ఉండగా.. భార్య, అత్తలే రాంబాబుకు సపర్యలు చేస్తున్నారు. జూట్ యాజమాన్యం 18 నెలల పీఎఫ్ బకాయిలను చెల్లించని కారణంగా రాంబాబుకు నెలవారీ రూ.1500 పెన్షన్ రావడం లేదు. కుటుంబ పోషణ కోసం ఆయన భార్య మాధవి ఓ ప్రైవేట్ కార్యాలయంలో చిన్నపాటి ఉద్యోగం చేస్తున్నారు. ఈ జీవితం నాకెందుకంటూ రాంబాబు రోదిస్తున్నారు.



లేవలేని స్థితిలో రోదిస్తున్న రాంబాబు

● జూట్‌మిల్లులో హెడ్ ఫిట్టర్‌గా పనిచేసిన అప్పారావు రైల్వేస్టేషన్‌లో సమోసాలు అమ్ముకుంటున్నారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు కార్మికులంతా తలో వృత్తిని ఎంచుకుని బతుకుబండి ఈడుస్తున్నారు. భవననిర్మాణ కార్మికులుగా, హోటళ్లలో సర్వర్లు, క్లీనర్లుగా, చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు కొనుగోలు చేయడం.. పండ్లు, కూరగాయలు, తినుబండారాలు అమ్ముకోవడం.. ఆటోలు నడుపుకోవడం వంటి వృత్తులను ఎన్నుకున్నారు. గ్రోత్‌సెంటరులో కొత్త పరిశ్రమల ఉనికి కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఉన్నవి కూడా రేపోమాపో మూతపడేందుకు సిద్ధమవుతున్నాయి.

ఉపాధి కోసం వలస వెళుతున్నాం..

బొబ్బిలిలోని జూట్‌మిల్లులు మూసివేయడంతో మేమంతా ఉపాధిని కోల్పోయాం. జూట్‌మిల్లులో పని అనుభవంతో నెల్లిమర్ల, ఏలూరు ప్రాంతాలలోని మిల్లులో పని దొరుకుతుందన్న ఆశలో పయనమయ్యాము. పని దొరికేవరకు ప్రత్యామ్నాయంగా ఏదో పని చేసుకుని బతుకుతాం. మా పిల్లాపాపలను పోషించేందుకు శ్రమించకతప్పదు కదా.

-కార్మికులు కిరణ్, మురళి, గోపి, సతీష్, శ్రీరామ్మూర్తి

శ్యామలాంబ పండగ ఏర్పాట్లు పరిశీలన

- పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశం

సాలూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలంబ పండగ ఏర్పాట్లను ఎస్పీ మాధవరెడ్డి బుధవారం పరిశీలించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అల్లువారి వీధిలో సిద్ధమవుతున్న సిరిమాను, అంజలి రథాన్ని పరిశీలించారు. జన్నివీధి, పెద్దకోమటిపేటలో ఉన్న అమ్మవారి గద్దెలను దర్శించారు. పండగ విజయవంతం చేయాలని, పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డీఎస్పీ ఎం.రాంబాబు మాట్లాడుతూ.. జీగిరాం నుంచి వచ్చే వాహనాలు కేవీఆర్ ఎస్టేట్‌లో ఉంచాలని, కొట్టక్కి నుంచి వచ్చేవి ముత్యాలమ్మ ఆలయం సమీపంలో ఉంచాలని తెలిపారు. నెలిపర్తి, మోసూరు, పాంచాలి నుంచి వచ్చే వాహనాలు బంటి స్టేడియంలో పార్కింగ్ చేయాలని సూచించారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. అశ్లీల నృత్యాలు పూర్తిగా నిషేధమని తెలిపారు. సిరిమాను తిరిగే చోట పార్కింగ్ ఉండదని వెల్లడించారు. భక్తుల దర్శనార్థం కూడళ్లలో ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేయనున్నామన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

మళ్లీ వచ్చాయ్!

- పసుకుడిలో ఏనుగుల సంచారం



భామిని, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి వంశధార నది దాటి మంగళవారం రాత్రి పసుకుడి ప్రాంతానికి ఏనుగులు తిరిగొచ్చాయి. బుధవారం ఆ గ్రామ పరిసరాల్లోని తోటల్లో అవి సంచరించాయి. దీంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. పంటలు ఎక్కడ నష్టపోతామోనని మరోవైపు రైతులు ఆందోళన చెందుతున్నారు. గజరాజుల కారణంగా పొలాలకు వెళ్లేందుకు కూడా సాహసించలేకపోతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి తక్షణమే వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.


ఆర్వోబీపై వేచి ఉన్న ప్రయాణికులు

నిలువ నీడేదీ..?

- గరివిడిలో బస్సు షెల్టర్లు లేవ్
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

గరివిడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గరివిడి పట్టణం లో ఎక్కడా బస్సు షెల్టర్లు లేవు. దాంతో ప్రయాణికులు ఇబ్బంది పడు తున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, సినిమాహాల్ సెంటర్, టీటీ కాలనీ సమీపంలోని ఆర్వోబీ, పాత గరివిడి సెంటర్ వద్ద బస్సులు, ఆటోలు, జీపుల కోసం రోజూ వందలాది మంది ప్రయాణికులు వేచి ఉంటుంటారు. అయితే ఓ ఒక్కచోటా బస్సు షెల్టర్ లేకపోవడం శోచనీయం. పట్టణంతో పాటు గెడ్డపువలస, తాటిగూడ, దువ్వాం, దేవాడ, దు మ్మెద, కోడూరు తదితర గ్రామాల ప్రజలు నిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు, ఆటోలు, జీపులు ఎక్కడానికి గరివిడి పట్టణానికి వస్తుంటారు. ఎండా, వానల సమయంలో బస్సులు, ఇతర వాహనాల కోసం ప్రయాణికులు దుకాణాల వద్ద లేకుంటే ఆర్వోబీ వద్ద దాతలు ఏర్పా టు చేసిన చిన్నపాటి పలకల మీద వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంటుంది. బస్సు షెల్టర్‌ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు అందుబాటులో ఉన్నా ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టడం లేదు. పర్యవసానంగా ప్రయాణి కులకు ఇబ్బందులు తప్పడంలేవు. ఇకనైనాఅధికారులు స్పందించి గరివిడిలో అవసరమైచోట బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అప్రంటీస్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐటీఐ పాసైన అభ్యర్థులకు మైలాన్ ఫార్మా పరిశ్రమలో అప్రంటీస్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టి.వి.గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విజయనగరం బయోటెక్‌లో ఉద్యోగావకాశాలు పొందేందుకు ఆసక్తిగల ఐటీఐ అభ్యర్థులు విజయనగరం ఐటీఐ కళాశాలలో అభ్యర్థులు సంప్రదించాలని కోరారు. 10వ తరగతి, ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లకు సండంధించిన వారు ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టుసైజు ఫొటోలు, బయోడేటాతో మే 2లోగా సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9849118075 సంప్రదించాలన్నారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పాచిపెంట మండలం గురువునాయుడుపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎం. రమణయ్యను అదుపులోకి తీసుకుని 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎం.రమణ తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ శ్రీధర్, ఈసీలు నాయుడు, మనోజ్ పాల్గొన్నారన్నారు. అలాగే నగరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎం.అప్పలనాయుడును అదుపులోకి తీసుకుని 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సిరిమాను చెట్టుకు పూజలు

జామి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జామిలో కొత్తలి రామునాయుడు, సత్యం కల్లాల్లో గుర్తించిన సిరిమాను చెట్టుకు బుధవారం భక్తులు పూజలు నిర్వహించారు. గంట్యాడ మండలం పెంటశ్రీరామపురంలో 18ఏళ్ల తర్వాత పైడితల్లమ్మ సిరిమాను పండగ చేస్తున్నారు. ఆ పండగకు ఇక్కడి సిరిమాను చెట్టు ఉందని అమ్మవారు పూజారి కలలో చెప్పడంతో వారు మేళతాళాలతో వచ్చి సిరిమానును తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా 500 మందికి అన్నసమారాధన చేశారు.

పెంటశ్రీరాంపురానికి చెట్టు తరలింపు

గంట్యాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) మండలంలోని పెంటశ్రీరాంపురంలో మే 10 నుంచి 14 వరకూ బొర్రా పైడితల్లిమ్మ పండగ జరగనున్న నేపథ్యంలో బుధవారం సిరిమాను చెట్టును గ్రామానికి తీసుకువచ్చారు. జామి మండలం కొత్తలవారి కల్లాల నుంచి సిరిమాను చెట్టును ఊరేగింపుగా తీసుకువచ్చారు. దారి పొడుగునా మహిళలు ముగ్గులు పోశారు. కార్యక్రమంలో పైడితల్లిమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభలకు చెట్ల గుర్తింపు

వేపాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపూడిలో గ్రామ దేవత పైడితల్లమ్మ ప్రభల తయారీకి రెండ్లు చెట్లను వల్లంపూడి గ్రామపెద్దలు రుద్ర వెంకటరావు, తాడి రాంబాబు గుర్తించారు. మే 20న నిర్వహించే అనుపోత్సవం సందర్భంగా ప్రభలకు వేపాడలోని కెక్రీను తోటలో ఓ చెట్టు, దబ్బిరాజుపేట బంగారమ్మ గుడి సమీపంలో మరో చెట్టు గుర్తించారు. బుధవారం రెండు చెట్లకు పూజలు నిర్వహించి గ్రామానికి తరలించారు.

ఘనంగా లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం

వేపాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుడిపాలలో బుధవారం శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు పవన్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

ఉత్సాహంగా పోటీలు ప్రారంభం

కొత్తవలస, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరయ్యపేటలో గ్రామదేవత బంగారమ్మ పండగ సందర్భంగా బుధవారం సాయంత్రం గ్రామంలో ఆహ్వానిత జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలుప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సహకారంతో అల్లూరిసీతారామజిల్లా, తూర్పుగోదావరి, విశాఖపట్టణం, విజయనగరం జిల్లా జట్లు పోటీలకు హాజరయ్యాయి. అలాగే పండగ సందర్భంగా మండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు.

రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ


రామకృష్ణ

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జిల్లా అధ్యక్షుడిగా కాళ్లకూరి వెంకట రామకృష్ణ వేణుగోపాలరావు నియమితులయ్యారు. బుధవారం ఆర్‌బీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య ఆయన్ని నియమించారు.

మహనీయుల గొప్పతనాన్ని తెలుసుకోవాలి

- కలెక్టర్ అంబేడ్కర్


బసవేశ్వర చిత్రపటం ఎదుట కలెక్టర్ నివాళి

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మహనీయులు జీవితాలను అధ్యయనం చేసి వారి గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. బసవేశ్వర జయంతిని బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. యువజన సంక్షేమ సంఘం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా బసవుడి చిత్ర పటానికి పూలమాల వేసి ఆయన నివాళి అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహనుభావులు త్యాగం, గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకుని చైతన్యవంతం కావాలన్నారు. దీని కోసం గొప్పవారి జీవిత చరిత్రలను చదవాలన్నారు. సమాజంలో కుల వ్యవస్థ, వర్గ బేధాలు, లింగ వివక్షను వ్యతిరేకించి లింగాయత్ ధర్మాన్ని స్థాపించారని వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, సెట్విజ్ సీఈవో సత్యనారాయణ, డీపీవో వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ రామారావు ఉన్నారు.

పన్ను ఎగవేతదారులపై ఎఫ్ఐఆర్‌లు: జేసీ


మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పన్ను ఎగవేతదారులపై ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయించేందుకు పోలీసు యంత్రాంగంతో చర్చించాలని అధికారులను జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. వాణిజ్య పన్నులు శాఖ జీఎస్టీ బకాయిలు, జనరల్ సేల్స్ టాక్స్, వ్యాట్ చట్టంలో బకాయిలు, రెవెన్యూ రికవరీ కేసులకు సంబంధించి ఎన్ను ఎగవేతదారుల నుంచి బకాయిలు రాబట్టేందుకు జిల్లా యంత్రాంగం సహకారం అందించాలన్నారు. ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, ఆర్డీవో కీర్తి ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం


ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భోగాపురం, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. బుధవారం స్థానిక సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయన్నారు. వైద్యులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.వెంకట రమణ, జనసేన మండల అధ్యక్షుడు వందనాల రమణ, పల్లంట్ల జగదీశ్, పల్ల రాంబాబు, సీహెచ్‌సీ సలహా సంఘం సభ్యుడు బొల్లు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కళాను పరామర్శించిన బేబీనాయన


కళాతో మాట్లాడుతున్న బేబీనాయన

రాజాం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో బుధవారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఆయనను పరామర్శించారు. రాజాంలోని ఆయన నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

డెంకాడ చేరిన సత్యసాయి రథం

డెంకాడ/భోగాపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): భోగాపురం మండలంలోని ముంజేరు నుంచి బుధవారం బయలుదేరిన సత్యసాయి రథం డెంకాడ చేరుకుంది. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, సేవాసమితి జిల్లా కోఆర్డినేటర్ సునీల్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మనోహర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

నెల్లిమర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణకు శ్రీకాకుళం జిల్లా బెజ్జిపురం యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ మండలంలోని రామతీర్థంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఇందుకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.ప్రసాదరావు, జి.యూసీరాణి, నారాయణమ్మ, బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధి అప్పారావు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రాజాం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గలవారు ఫిట్టర్, డ్రాఫ్‌మెన్ సివిల్ ట్రేడుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు

సింహాచలంలో ఘటన బాధాకరం


ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటన అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం ఆమె పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మృతుల కుటుం బాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎవరూ అధైర్యపడవద్దన్నారు.

చందనోత్సవంలో అపశ్రుతి దురదృష్టం


ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) సింహాద్రి అప్పన్న చందనోత్సవం వేళ జరిగిన ఘటన జరగడం దురదృష్టకరమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవా లని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

డీసీసీబీ ప్రతిష్ఠను పెంచుతా..

- చైర్మన్ కిమిడి నాగార్జున


నాగార్జునను అభినందిస్తున్న టీడీపీ జిల్లా కార్యదర్శి ఐవీపీ రాజు

విజయనగరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేస్తానని చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా బ్యాంకు సేవలు అందేలా చర్యలు చేపడతానన్నారు. బుధవారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. సంస్థలు, వ్యవస్థలు ప్రజాస్వామ్యానికి మూల స్థంబాలన్నారు. అవి బాగుంటే సంబంధిత వర్గాలకు న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. డీసీసీబీ బాధ్యతలను ఒకే పార్టీ సుదీర్ఘకాలం చేపట్టిందన్నారు. దాంతో ప్రజల్లో వేరే అభిప్రాయం ఉందన్నారు. చదువుకున్నవాడిగా, డీసీసీబీని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం తన సేవలను గుర్తించి టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ తనకు డీసీసీబీ బాధ్యతలు అప్పగించారన్నారు. వారి నమ్మకాన్ని ఒమ్ము చేయనన్నారు. త్వరలో పాలకవర్గం కొలువు తీరనుందన్నారు. బ్యాంకు స్థితిగతులను పరిశీలించిన అనంతరం రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కూడా కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండటమే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని నాగార్జున అన్నారు.

పార్టీకి రుణపడి ఉంటా..


చీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

చీపురుపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తన సేవలు, పనితనాన్ని గుర్తించి డీసీసీబీ చైర్మన్ పదవి ఇచ్చిన పార్టీకి రుణపడి ఉంటానని కిమిడి నాగార్జున అన్నారు డీసీసీబీ చైర్మన్ నియామకం అనంతరం చీపురుపల్లి వచ్చిన ఆయనకు పార్టీ కార్యకర్తలు బుధవారం ఘన స్వాగతం పలికారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కనకమహలక్ష్మి అమ్మవారిని నాగార్జున దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఆయినకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయబోనన్నారు. గడచిన ఏడేళ్లుగా తన శక్తిని, సమయాన్ని పార్టీ కోసమే కేటాయించానన్నారు. తనపై కార్యకర్తలు చూపిస్తున్న ప్రేమాభిమానాలు పదవి కంటే చాలా గొప్పవన్నారు. జిల్లాలోని నాయకులు, కార్యర్తలు, రైతుల కోసమే తన అధికారాన్ని వినియోగిస్తానన్నారు. ర్యాలీలో పార్టీ నాయకులు ముల్లు రమణ, ఆరతి సాహు, సబ్బి సోనియా, మీసాల శ్రీధర్, రేగిడి వాసు, పలు గ్రామానికి చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమారాం పంచాయతీ రికార్డుల తనిఖీ

జామి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుమారాం పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం డీపీవో వేంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనతో పాటు డీఎల్‌పీవో మోహనరావు, ఈవోపీఆర్డీ ఉమ ఉన్నారు. పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. నాలుగు నెలలుగా పంచాయతీకి వచ్చిన నిధులు, వాటి ఖర్చుల వివరాలను పంచాయతీ కార్యదర్శి సుభద్రను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ పంచాయతీలో పెద్దమొత్తంలో నిధులు గల్లంతైనట్టు పలువురు గ్రామస్థులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో గతంలో ఇక్కడ రికార్డులను జిల్లా పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాటి నుంచి ఎలాంటి చర్యలు చేపట్టకపోగా.. మళ్లీ బుధవారం పంచాయతీ కార్యాలయానికి డీపీవో వచ్చి రికార్డులను హడావుడి తనిఖీ చేయడం చర్చనీయాంశమైంది.

విద్యార్థిని దుర్మరణం


ఉమా (ఫైల్)

మక్కువ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తూరుమామిడి సమీపంలో బుధవారం ఓ విద్యార్థిని తలపై నుంచి ట్రాక్టరు దూసుకుపోయిన ఘటనలో ఆమె దుర్మరణం పాలైంది. పోలీసుల కథనం మేరకు.. తూరుమామిడి గ్రామానికి చెందిన కురసాన నూకమ్మ అలియాస్ ఉమా (20) బొబ్బిలిలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. మంగళవారం తన స్నేహితురాలి ఫంక్షన్ నిమిత్తం స్వగ్రామానికి వచ్చింది. తిరిగి బొబ్బిలి అదే గ్రామానికి చెందిన పత్తికాయల శివ ద్విచక్రవాహనంపై బుధవారం బయలుదేరింది. తూరుమామిడి నుంచి శాంతేశ్వరం వైపు ద్విచక్రవాహనం, అదే సమయంలో శాంతేశ్వరం నుంచి ఎదురుగా ట్రాక్టర్ వస్తున్నాయి. ద్విచక్రవాహనాన్ని ఎడమ వైపు కంట్రోల్ చేయిబోయి ఇద్దరూ రోడ్డుపై కుడివైపు పడిపోయారు. వెంటనే శివ లేచి పక్కకు తప్పుకున్నాడు. అదే సమయంలో ఉమా తలపై నుంచి ట్రాక్టర్ టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఉమా తండ్రి కురసాన జనార్దనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకట బైరిపురం గ్రామానికి చెందిన గంజి సింహాచలాన్ని గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ సాలూరు శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

భోగాపురం, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని చాకివలస జంక్షన్ సర్వీస్ రోడ్డు బస్‌షెల్టర్ సమీపంలో ప్రమాదవశాత్తు కాకినాడకు చెందిన కంద ఉమామహేశ్వరరావు(32) మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్టు ఏఎస్ఐ ఖాన్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కాకినాడకు చెందిన ఉమామమేశ్వరరావు లింగాలవలస సమీపంలో పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడన్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్లే సర్వీసు రోడ్డులో భోగాపురం నుంచి తగరపువలస వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చాకివలస జంక్షన్ బస్‌షెల్టర్ వద్ద ప్రమాదవశాత్తు పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోవు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

బొండపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బొండపల్లి-చందకపేట గ్రామాలకు మధ్యలో బుధవారం రైలు నుంచి జారిపడి బుధవారం ఉదయం వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెచ్‌సీ కృష్ణారావు తెలిపారు. టిట్లాఘర్ రైల్వే టిక్కెట్టు మృతుడి వద్ద ఉందన్నారు. దాదాపు 40 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. నీలిరంగు ఫుల్ టీషర్టుతో పాటు నల్లరంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని సర్వజన కేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విజయనగరం రైల్వే ఎస్ఐ 9490617089, బొబ్బిలి, విజయనగరం జీఆర్‌పీ హెచ్‌సీలు 9444101333095, 9591813163లను సంప్రదించాలని కోరారు.

కొడుక్కి పెళ్లి కావడం లేదని..

- తండ్రి ఆత్మహత్య

రాజాం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొడుక్కి పెళ్లి కావడం లేదని మనస్తాపంతో తండ్రి ఆత్మహత్యకు పాల్పడి వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. సీఐ కె.అశోక్‌కుమార్ అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి మండలం పనసలవలస గ్రామానికి చెందిన తాతపూడి దుర్గారావు (54) రెండేళ్ల క్రితం డోలపేటలో స్థిరపడ్డాడు. దుర్గారావు పెద్ద కుమారుడి పెళ్లి చేయాలని ఎన్నోసార్లు యత్నించాడు. ఏప్రిల్ 23న వచ్చిన సంబంధం కూడా సెట్ కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మద్యం అలవాటున్న దురారావు ఏప్రిల్ 23న మద్యం సేవించి తన ఇంట్లోని గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి కొనఊపిరితో ఉన్న దురారావును రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుం చి శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చేర్చారు. అక్కడి చికిత్స పొందుతూ దుర్గారావు బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ధనుంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు.

620 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

సీతంపేట రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబగ్గ పంచాయతీ పరిధిలోని బెత్తుపురం సమీపంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 620 లీటర్ల బెల్లం ఊటలను గుర్తించిన ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. బుధవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని చెప్పారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నెల్లిమర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలంలోని దేవునికనపాకలో బుధవారం నిర్వహించిన దాడిలో పాడి అచ్చాలు 10 లీటర్ల సారాతో పట్టుబడ్డారని నెల్లిమర్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరావు తెలిపారు. అతడిని అరెస్టు చేసి సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో ఎస్ఐ నాగేశ్వరరావు, హెచ్‌సీలు ఎం.అప్పారావు, పీసీలు డి.కె.శంకర్, కె.సీతాలక్ష్మి పాల్గొనారన్నారు.

బాలుడి అదృశ్యం

లక్కవరపుకోట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలలోని ఆర్జీపేటకు చెందిన బత్తిన సూరిదేముడు తన కుమారుడు కోటేశ్వరరావు(12) కనబడడం లేదని బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారని హెచ్‌సీ పాపారావు తెలిపారు. కో టేశ్వరరావు మండలంలో ఎస్సీ హాస్టల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడన్నారు. వేసవి సెలవులు ఇచ్చిన తర్వాత ఇంటికి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సూరిదేముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

తాండ్రంగిలో గడ్డికుప్పల దగ్ధం

జామి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్రంగిలో మంగళవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో గడ్డికుప్పలు దగ్ధయ్యాయి. గ్రామానికి చెందిన బర్నికుప్పల తాత కల్లంలో రాత్రి 11 గంటల సమ యంలో మంటలు వ్యాపించాయి స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక శాఖ కు సమాచారం అందించారన్నారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మం టలను అదుపు చేశారు. రూ.30 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

నేటి నుంచి తాగునీటి సరఫరా

రాజాం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలో గురువారం నుంచి 24 వార్డులకు తాగునీటి సరఫరా జరుగుతుందని కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ పొన్నాడ వెంకటరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. డోలపేట చెక్‌పోస్టు వద్ద ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులు పూర్తయిందని యథావిధిగా నీరు సరఫరా అవుతుందని వారు తెలిపారు.

నేటి నుంచి మార్కెట్‌లోకి చిరువ్యాపారులు

గజపతినగరం ఏప్రిల్ 30:(ఆంధ్రజ్యోతి): గజపతినగరం పంచాయతీ పరిధిలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌లో గురువారం నుంచి వ్యాపారాలు కొనసాగించనున్నారు. 'నిరుపయోగంగా కూరగాయల మార్కెట్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సర్పంచ్ నరవ కొండమ్మ, పంచాయతీ ఈవో జనార్దనరావు ఆరుబయట వ్యాపారాలు సాగిస్తున్న వారితో మాట్లాడారు. గురువారం నుంచి ఎవరికి కేటాయించిన షాపుల్లో వారు వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. లేకుంటే వ్యాపారులు కట్టిన డిపాజిట్ రూ.5 వేలు ఇవ్వమన్నారు. సంబంధిత షాపును వేరే వారికి కేటాయిస్తామని హెచ్చరించారు. దీంతో చిరు వ్యాపారులు గురువారం నుంచి తమకు కేటాయించిన షాపుల్లో వ్యాపారాలు చేసుకునేందుకు అంగీకరించారని ఈవో జనార్దనరావు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అంబాడలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

రేగిడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాడలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు సరఫరాను పునరుద్ధరించారు. గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడై 'నిలిచిపోయిన విద్యుత్ సరఫరా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ డిప్యూటీ డీఈఈ ఫణికుమార్ ఆదేశాలతో ఏఈ సురేష్‌కుమార్ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

పఠనాసక్తిని పెంపొందించేందుకే 'పుస్తక క్లబ్'


గురజాడ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు విద్యల నగరి పుస్తక క్లబ్‌ను ప్రారంభించినట్టు ప్రముఖ రచయిత డాక్టరు జక్కు రామకృష్ణ అన్నారు. బుధవారం గురజాడ స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై పుస్తక క్లబ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో చిన్నపిల్లలకు ప్రత్యేకంగా పుస్తక క్లబ్ లేదన్నారు. చిన్నారులు పుస్తకాలను తమ నేస్తాలుగా మార్చుకునే ఒక మంచి అలవాటు తీసుకుని రావడానికి విజయనగరం రీడ్స్ సంస్థ ఈ ఆలోచన చేసిందన్నారు. డా.పీవీఎల్ సుబ్బారావు మాట్లాడుతూ మంచి అన్నది పెంచమన్నా.. అంటూ గురజాడ చెప్పారని, అందరం మంచిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. గురజాడ ఆలోచనలను అనుసరించి చిన్నారులు ఇటువంటి పుస్తక క్లబ్‌ను వినియోగించుకుని మేథాశక్తిని పెంచుకోవాలన్నారు. విజయనగరం రీడ్స్ సంస్థ ప్రతినిధి రేపల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి సృజానాత్మక పుస్తక క్లబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమ న్నారు. కార్యక్రమానికి ముందు మహాకవి గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

20న లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సమ్మె



నినాదాలు చేస్తున్న మునిసిపల్ కార్మికులు

బొబ్బిలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి బీజేపీ ప్రభుత్వం కొత్తగా నాలుగు లేబర్ కోడ్స్ చట్టాలను తెస్తోందని, దీనికి వ్యతిరేకంగా ఈనెల 20న నిర్వహించే సమ్మెలో సంఘటితంగాపాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు పిలుపునిచ్చారు. బుధవారం బొబ్బిలి కోవెల సెంటరులో మునిసిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిది గంటల పనిని 12 గంటలకు పెంచడం, సమ్మెచేస్తే కటకటాల పాలు చేయడం, వంటి అనేక భయంకరమైన విధానాలను కొత్తచట్టంలో పొందుపరుస్తున్నారని దుయ్యబట్టారు. దీనికి కార్మికలోకమంతా ఒక్కటై వ్యతిరేకిస్తోందని, సమ్మెకు పిలుపునిచ్చిందని, ఇందులో ప్రతీ కార్మికుడు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు గౌరి, రామారావు, వాసు, శంకరరావు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

● బొబ్బిలి మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

బొబ్బిలి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దని మునిసిపల్ కమిషనరు లాలంరామలక్ష్మి కోరారు. బుధవారం అప్పయ్యపేట, మహారాణిపేట, గొల్లవీధి, పూల్‌బాగ్, మార్కెట్ ఏరియా, మేదరబంద, జయప్రకాశ్‌స్కూల్ రోడ్డు ప్రాంతాల్లోఅకాల వర్షాలకు నీరు, చెత్త నిలిచిపోవడంతో సిబ్బందిని ఆమె అప్రమత్తం చేశారు. అప్పయ్యపేట శ్మశానవాటికలో ఇటీవల నిర్మించిన అప్రోచ్‌రోడ్డును పరిశీలించారు. ప్రహరీనిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఏఈని కోరారు. శానిటేషన్ పనులను పరిశీలించారు. గొల్లపల్లి దాడితల్లి గ్రామదేవత పండుగ పురస్కరించుకుని సిరిమాను తిరిగే ప్రాంతాల్లో చేయాల్సిన మరమ్మతులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

బాలికల కోసం 'కిశోరి వికాసం'

● ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం కార్యక్రమం దోహదపడుతుందని ఐసీడీఎస్ సీడీపీవో జె.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల రెండో తేదీ నుంచి జూన్ 10 వరకు గ్రామాల్లో 15 నుంచి 18 సంవత్సరాల వయసు పిల్లలకు సమూహాలుగా ఏర్పాటుచేసి రోజుకు ఒక టీం ప్రకారం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణరావు, వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి, పిరిడి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రఘువంశి, సూపర్‌వైజర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

110 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం: ఏవో

రామభద్రపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మట్టి నమూనాల సేకరణకు రైతులు సహకరించాలని ఏవో వి.వెంకటయ్య కోరారు. బుధవారం రామభద్రపురంలోని మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 110 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ దిశగా పలుగ్రామాల్లో ఈ మట్టి నమూనాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపించి భూసార పరీక్షలు చేపట్టి కార్డులను రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. దీంతో మట్టిలో సూక్ష్మ పోషకాలు, నైట్రోజన్, పొటాషియం, కార్బన్ శాతం ఏశాతంలో ఉన్నాయో తెలుసుకోవచ్చునని చెప్పారు. దీని ఆధారంగా ఎరువుల వినియోగం, పంటల యాజమాన్యంతో సాగుచేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. ఇప్పటివరకు రైతు సేవా కేంద్రాల వారీగా ఈ మట్టి నమూనాలను సేకరిస్తున్నామని తెలిపారు. రావివలస, రామభద్రపురం, ఆరికతోట తదితర గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణ చేపట్టామని చెప్పారు.ఈ సమావేశంలో తారాపురం ఏఈవో పి.వెంకటరమణ, రామభద్రపురం ఏఈవో సునీత, ఏఏవో కొండలరావు పాల్గొన్నారు.

శ్రీశ్రీ శ్రమజీవుల పక్షపాతి



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బొబ్బిలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) శ్రమజీవుల పక్షపాతి అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం బొబ్బిలిలో యూటీఎఫ్, గ్రీన్‌బెల్ట్‌సొసైటీ ప్రతినిధులు కె.విజయగౌరి, ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి వేడుకలను నిర్వహించారు.

ఉపాధి పని దినాలు పెంచాలి: ఎంపీడీవో



మాట్లాడుతున్న రామకృష్ణ

బాడంగి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి పని దినాలను పెంచాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరాసరి వేతనం రూ.300 నుంచి 307 ఉండేలా చూడాలని క్షేత్ర, సాంకేతిక సహాయకులకు సూచించారు. పంచాయతీకి కనీసం నాలుగు ఫాంపాండ్ల గుర్తించి పనిని ప్రారంభించాలన్నారు. వ్యక్తిగత ఇంకుడు గుంతలు ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. మస్తర్లలో ఎటువంటి దిద్దుబాట్లు లేకుండా ఖచ్చితంగా ఉండాలన్నారు. వేతనదారులు ఉదయం ఆరు గంటలకే పని ప్రదేశానికి రావాలని కోరారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. మూమెంట్ రిజిస్టర్ కూడా తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. బయోమెట్రిక్ హాజరు రిపోర్టు ఉదయం 10. 40 గంటలకు కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు.

ప్రశాంతంగా పాలిసెట్

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కలవరాయిలో గల స్వామి వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. దయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 562 మందికి గానూ 466 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.



బొబ్బిలి రూరల్: కోమటిపల్లి వద్ద నేలకొరిగిన చెట్టు



బొబ్బిలి: కాలేజీరోడ్డులో చేరిన వర్షపునీరు



కొత్తవలస: కొత్తవలసలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఈదురుగాలులతో అపారనష్టం

● నేలకొరిగిన అరటి, మామిడి పంటలు, కూలిపోయిన స్తంభాలు
● ఆందోళన చెందుతున్న రైతులు

జిల్లాలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో అన్నదాతకు అపారనష్టం జరిగింది. పలు చోట్ల అరటి, మామిడి పంటలు నేలకొరిగాయి. రోడ్ల అడ్డంగా చెట్లు కూలిపోవడంతో బుధవారం రాకపోకలకు అంతరాయం కలిగింది.

● బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోమటిపల్లి, కలవరాయి తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షానికి రహదారుల పక్కన చెట్లు విరిగి కూలిపోవడంతో బుధవారం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వీటిని తొలగించడానికి అధికారులు ముందుకు రాకపోవడంతో ప్రయాణికులే వాటిని పక్కకు జరిపి రాకపోకలు సాగించాల్సివచ్చింది. కొత్తపెంట, మెట్టవలస తదితర గ్రామాల పరిధిలో అరటి చెట్లు నేలకొరిగాయి. మామిడి కాయలు రాలిపోవడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

● బొబ్బిలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. బుధవారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షానికి పట్టణంలోని మురుగుకాలువల్లో చెత్త పేరుకుపోయింది.

● రామభద్రపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలో మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన వర్షాలకు ప్రజలు ఊరట చెందారు. వేసవి దుక్కులకు వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

● కొత్తవలస, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో బుధవారం మధ్యాహ్నం గంటసేపు వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.

● గజపతినగరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురిటిపెంట, సీతారామపురం, లింగాలవలస, తుమ్మికాపల్లి, పి.ఎస్. ఆర్.పురం, కె.ఎస్.ఆర్.పురం, కాళంరాజపేట తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటకు నష్టం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి వర్షం కురవడంతో పొలాల్లో పంటను కాపాడుకునేందుకు రైతులు ఆపసోపాలు పడ్డారు. వర్షంలో పంట తడిస్తే మొలకలు వచ్చే ప్రమాదం ఉండటంతో బుధవారం రైతులు పంటను సురక్షిత ప్రాంతాలకు చేర్చే పనిలో పడ్డారు.

● సంతకవిటి,ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తారపురం, హోంజరాం, బూరాడపేట గ్రామాల్లో ఈదురు గాలులకు స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్‌సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు. మామిడిపల్లి, పల్లిట, సురవరం, రంగారాయపురం, కొండగూడెం, బొద్దూరు తలతంపర తదితర గ్రామాల్లో మామిడికాయలు నేలరాలడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

రుద్రభూమినీ వదలరా?

(ఐదో పేజీ తరువాయి)

సొంత నిధులు సుమారు రూ.నాలుగు లక్షలు వెచ్చించి, మిగిలి ఉన్న 22 సెంట్ల భూమికి ప్రహరీ, అంత్యక్రియల కోసం ఓ షెడ్డు నిర్మించారు. స్నానపు గదులు నిర్మించాల్సి ఉంది. వాస్తవానికి ఇప్పుడున్న 22 సెంట్లు చాలడం లేదు. శ్మశానంలో అదనపు నిర్మాణాల ప్రతిపాదన కూడా ముందుకు సాగడం లేదు. 2019లో కొవిడ్ విజృంభించిన సమయంలో ఏకకాలంలో పలువురు మృత్యువాత పడడంతో కర్మకాండల నిర్వహణకు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి.

వాస్తవ విస్తీర్ణం ఎంత

రామాంజనేయ కాలనీ సమీపంలో ఉన్న శ్మశాన వాటికకు సర్వే నం.42, 43లోని గుట్ట ప్రాంతంలో 3.2 ఎకరాల స్థలం ఉంది. పట్టణంలోని అత్యధికంగా ఉన్న వైశ్య కుటుంబాలు, రామాంజనేయ కాలనీ వాసులు, ఆంజనేయపురం, మెయిన్ రోడ్డులోని కొన్ని ప్రాంతాలకు చెందిన వారు ఈ శ్మశాన వాటికనే వినియోగిస్తారు. ఈ స్థలానికి ఆనుకొని 1999లో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు. ఆ సమయంలో అవే సర్వే నంబర్ల పరిధిలో కొంత స్థలాన్ని ఆర్టీసీ సంస్థ తీసుకుంది. మండల పరిషత్ కార్యాలయం వెనుక వైపున సర్వే నం.42/2డీలో ప్రభుత్వానికి అవసరమైన వెల్‌నెస్ సెంటరు నిర్మాణం కూడా జరిగింది. కొత్తగా నిర్మించిన నీళ్ల ట్యాంకులు, సంప్, సంబంధిత షెడ్లు కూడా ఆ స్థలంలోనే ఉన్నట్టు రికార్డులు చూపుతున్నాయి. సంత మార్కెట్ నుంచి రామాంజనేయ కాలనీ మీదుగా, వంగపల్లిపేటకు వేసిన సీసీ రోడ్డు సర్వే నం.43/27జే లోనే ఉంది. సర్వే నం.42/2ఈ లో ఉన్న సుమారు 53 సెంట్ల స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి ఏకంగా ప్రహరీ నిర్మించేశారు. ఇలా ప్రైవేటు వ్యక్తులు ఎవరికి వారే ఆక్రమించుకోవడం, మరికొంత భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించడంతో శ్మశాన స్థలం కుచించుకుపోయింది. ఇటీవల మండల పరిషత్ నిధులతో బోరు తవ్వించారు. అదే గ్రాంటుతో టైల్స్ కూడా వేయిస్తున్నారు. ఇవన్నీ బాగానే ఉన్నా శ్మశానికి స్థల సమస్య తీవ్రంగా ఉంది. ప్రభుత్వం చొరవ తీసుకుని అదనపు స్థలాన్ని కేటాయించాలని లేకుంటే ఇతరుల ఆక్రమణలో ఖాళీగా ఉన్న స్థలాన్ని శ్మశానికి ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

శ్మశానాన్ని ఆక్రమించకూడదు

శ్మశానం కోసం కేటాయించిన స్థలాల్లో ఆక్రమణలు ఉండకూడదు. సర్వే నం.42, 43లో సర్వే నిర్వహించాం. ఆక్రమణలున్న మాట వాస్తవమే. ఆక్రమణదారుల్ని గుర్తించడం కూడా జరిగింది. వారికి త్వరలోనే నోటీసులు ఇస్తాం. అవి తొలగించిన తరువాత ఆ భూమి శ్మశానానికే చెందుతుంది.

-ఎన్.రాజారావు, తహసీల్దారు, చీపురుపల్లి

గృహయోగం

(ఐదో పేజీ తరువాయి)

లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి గృహ నిర్మాణశాఖ సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకూ ముందుకు కదులుతున్నారు. కొద్దిరోజుల కిందట 11, 648 ఇళ్లు పూర్తి చేయాలనుకున్నారు. వీటిలో 4,127 ఇళ్లు పూర్తి చేశారు. మిగతా 7,481 ఇళ్లని జూన్ 12 నాటికి పూర్తిచేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై జూన్ 12 నాటికి ఏడాదవుతుంది. ఈ నేపథ్యంలో తాజాగా లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగుతున్నారు. మరోవైపు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద ఇంత వరకూ 33,671 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటి మంజూరు ప్రక్రియ కూడా త్వరలో పూర్తికానుంది.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

బెలగాం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలు పరిష్కరిం చాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పార్వ తీపురంలోనిసుందర్య భవనం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.అనంతరం డీఆర్వో హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తెలంగాణలో ఇచ్చిన విధంగా పేస్కేల్ అమలు చేయా లని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మన్మథరావు, రమణ పాల్గొన్నారు.

సహజ వనరులతో సాగు చేయాలి

● జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు

గరుగుబిల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉండే సహజ వనరులతో పంటలు సాగు చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు సూచించారు. బుధవారం మండలంలోని నందివానివలస, తోటపల్లి గ్రామాల్లో ప్రకృతి విధానాలతో సాగు చేస్తున్న పలు రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసిన తదుపరి వేసుకోవాలన్నారు. 15మండలాల పరిధిలో విత్తనబంతులు తయారీపై అవగాహ కల్పిస్తున్నామన్నారు. రైతులు ఏక పంట విధానం నుంచి బహుళ పంటల విధానానికి మారాలన్నారు. తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులు సాధిం చడం తోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, సిబ్బంది డి.వెంకటనాయుడు, జి.లత పాల్గొన్నారు.

చెత్త సేకరణ వివరాలు అప్‌లోడ్ చేయండి

పాచిపెంట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ప్రజలకు చెత్త సేక రణ, పొడి, తడి చెత్త ప్రజల నుంచి సేకరించడంపై అవగాహన కల్పించాలని ఈవోపీఆర్‌డీ మల్లేశ్వరరావు కోరారు. పీఆర్ వన్ యాప్‌లో ప్రతి రోజూ చెత్త సేకరణ వివరాలు అప్‌లోడ్ చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. బుధ వారం పాచిపెంట పంచాయతీ పరిధిలో గల ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను గ్రామ సచివాలయ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. స్వర్ణ పంచాయతీల్లో ఇళ్ల వివరాలు, ప్యూరిఫికేషన్ చేయడం, పంచాయతీ నుంచి చెల్లించాల్సిన గ్రంథాలయం, స్టోర్సు, ఫైర్, సెస్‌లను చెల్లించే విధంగాచర్యలు తీసుకోవడంపై అవగాహన కల్పించారు.

కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమాలు

సీతానగరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలకు వేసవి సెలవులు పురస్కరించుకుని శుక్రవారం నుంచి జూన్ పదో తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బలిజిపేట ప్రాజెక్టు సీడీపీవో ఎస్.సులేఖ తెలిపారు.బుధవారం సీతానగరంలోని డంపింగ్ యార్డు హాల్‌లో మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆదేశాల మేరకు మండల స్థాయిలో కిశోర వికాసం వర్క్‌షాపును నిర్వహించారు.ఈ సందర్భంగా సులేఖ బాల్య వివాహాలు, రుతుక్రమం, పరిశుభ్రత,బాలల హక్కులు, పోషణ,ఆరోగ్యం, లింగ సమానత్వం తదితర అంశాలపై వివరించారు.కార్యక్రమంలో పి.శ్రీధర్, హరి కృష్ణ, ఎ.రమ్య పాల్గొన్నారు.

శ్యామలాంబ ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ

సాలూరు,ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని శ్యామలాంబ అమ్మవారి ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ బుధవారం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావుతో పాటు కేతిరెడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారికి..

వీరఘట్టం, ఏప్రిల్ 30 (ఆం ధ్రజ్యోతి): వీరఘట్టంలో వెలిసిన పైడితల్లి అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2002లో అక్షయ తృతీయ పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఏటా అమ్మవారు నిజరూప దర్శనం ఇస్తుంటారు. దీంతో వీరఘట్టంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తోటపల్లిలో 'అక్షరాభ్యాసం'

గరుగుబిల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు బుధవారం సరస్వతీదేవి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్, దేవాదాయశాఖ సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ ప్రాంతంలో సరస్వతిదేవి ఆలయం లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, భక్తుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఇటీవల ఆలయాన్ని ప్రతిష్ఠించినట్లు చెప్పారు.

ఆలయానికి చేరిన ఎర్రకంచమ్మ ఘటాలు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల ఇలవేల్పు ఎర్రకంచమ్మ తల్లి ఘటాలు జగన్నాథపురంలోని ప్రధాన ఆలయానికి బుధవారం రాత్రి చేరాయి. తొలుత రాత్రి రాజుగారి కోటలోని కోటదుర్గా ఆలయంలో ఎర్రకంచమ్మ తల్లి ఘటాలకు జగన్నాథపురం పెద్దలు, మహిళలతో పాటు కమిటీ సభ్యులు పూజలు చేశారు. అనంతరం కోటదుర్గా ఆలయం నుంచి ప్రధాన ఆలయం వరకు మేళతాళాలు, బాణసంచా కాలుస్తూ కమిటీ సభ్యులు పట్టణ ప్రధాన రహదారి గుండా పాలజంగిడి, ఘటాలను ఊరేగించారు.ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర జగన్నాథపురంలో ప్రధాన ఆలయంతో ఎర్రకంచమ్మ,రాజుగారి కోటలోని కోటదుర్గకు పూజలు నిర్వహించారు. కంచమ్మ పాలజంగిడిని మోశారు. కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు

వీరఘట్టం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు లేదా గృహనిర్మాణశాఖాధికారులు తెలియజేస్తే సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకొనేందుకు అనుమతులు మంజూరుచేస్తారని మండల గృహ నిర్మాణ శాఖాధికారి వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరఘట్టం, చలివేంద్రి, దశమంతుపుర, కంబర, తెట్టంగి, సంతనర్సిపురం గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన లేఅవుట్లల్లో ఏఒక్క లబ్ధిదారుడు కూడా ఇంటిని నిర్మించలేదని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం లబ్ధిదారులకు వెసులుబాటు కల్పించిందని తెలిపారు. లేఅవుట్లల్లో లబ్ధిదారులుగా ఉండి, వారికి సొంత స్థలం ఉంటే గ్రామ సచివాలయం ఇంజనీరింగ్ సహాయకులకు లేదా గృహ నిర్మాణశాఖాధికారులకు తెలియేస్తే ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకొనేందుకు అనుమతులు మంజూరుచేస్తారని పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. బుధవారం పట్టణంలోని ఏపీ వెనుకబడిన తరగతుల సహకార, ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళ సాధికారితేప్రభుత్వ ఆశయమన్నారు. కార్యక్ర మంలో టీడీపీ పట్టణాధ్యక్షులు జి. రవికుమార్, పట్టణ కార్యదర్శి ఎం. వెంకటేష్, పి. రాజశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎంసీఏ నాయకులు కోరారు.ఈమేరకు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల్లో బీఎస్సీ నర్సింగ్ పట్టభద్రులను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లగా నియమించారని, అప్పటి నుంచి ఆరోగ్య వ్యవస్థను బలపరుస్తూ ప్రజలకు సేవా కార్యక్రమాలను అందిస్తున్నారన్నారు. ఆరేళ్లైనా ఇంతవరకు ఉద్యోగ, ఆర్థిక భద్రత కల్పించలేదన్నారు. .

మౌలిక వసతులు కల్పనకు చర్యలు

నియోజకవర్గ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసు కుంటున్నామని ఎమ్మెల్యే బోనెల విజయంద్ర తెలిపారు.ఈ మేరకు తన కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

మద్దతు ధర కల్పించాలి

బెలగాం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జీడిపిక్కలకు కనీసం మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు.బుధవారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజనులు, రైతులపై చిత్తశుద్ధ లేదని ఆరోపించారు.జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలను పంటకాలం చివరి దశలో ప్రారంభించడమే నిదర్శమని విమర్శించారు. జిల్లాలో 68 వేల ఎకరాల్లో జీడి పంటను రైతులు, గిరిజనులు పండిస్తున్నారని తెలిపారు. కిలో రూ.200 కొనుగోలుచేయాల్సిన ప్రభుత్వం రూ.140 నుంచి రూ.170 వరకు కొనుగోలు చేసేందుకు నిర్ణయించడంతో రైతులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు.కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

సేల్స్‌మన్‌పై చర్యలు తీసుకోవాలి

సాలూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా రేషన్ సరు కులు ఇవ్వకపోతే ఏమి తింటామని దళాయివలస జీసీసీ డీఆర్ డిపో పరిధిలో ఉన్న గిరిజనులు వాపోయారు. రేషన్ సరుకులు ఇవ్వాలని, సేల్స్‌మన్‌పై చర్య లు తీసుకోవాలని కోరారు.బుధవారం సాలూరు తహసీల్దార్ కార్యాలయం ఎదు ట సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళాయివలస జీసీసీ డీఆర్‌డిపో పరిధిలో దాదాపు 250గిరిజన కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయని, రెండు నెలలకు ఆయా కుటుంబాలకు రేషన్ సరుకులు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ విషయంపై సేల్స్‌మన్‌ను ప్రశ్నించిన ఫలితం లేకపోయిందన్నారు. డిపో తీరుపై అధికారులు విచారణ జరపాలని, గిరిజనులకు తక్షణమే సరుకులు అందించాలని డిమాండ్ చేశారు.

కాల్షియం కార్బైడ్ వినియోగిస్తే చర్యలు

పాలకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నిషేధిత కాల్షియం కార్బైడ్ విని యోగిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వై.రామయ్య హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మామిడి పండ్లు విక్రయిస్తున్న వ్యాపార సముదాయాల వద్ద నిర్వాహకులతో అధికారులు మాట్లాడారు. ఎవరైనా కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. కార్య క్రమంలో ఉద్యాన అధికారి టి.అమరేశ్వరి, మార్కెటింగ్ సూపర్‌వైజర్ సూర్య నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

